ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
ఆదివారం 12 అక్టోబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

తగ్గనున్న విద్యుత్ భారం

ఆరేళ్ల తర్వాత తగ్గనున్న ఛార్జీలు ● వచ్చే నెల నుంచి అమల్లోకి

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.23 కోట్ల ఉపశమనం



చిత్తూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ అమల్లోకి రానుంది. వైసీపీ హయాంలో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచిన విషయం తెలిసిందే.ఇప్పుడు ఈఆర్సీ సూచనతో కూటమి ప్రభుత్వం ట్రూడౌన్ పేరిట బిల్లుల భారాన్ని తగ్గిస్తోంది. నవంబరు నెల నుంచి ఈ తగ్గింపు ప్రయోజనాలు అమల్లోకి రానున్నాయి.

ఉచిత విద్యుత్‌ను వ్యవసాయ కనెక్షన్లకు మినహాయిస్తే.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇతర సర్వీసులు 35.26 లక్షలున్నాయి.ఇప్పటిదాకా విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా, పంపిణీ నష్టాలు, ఇతర వ్యయాలు కలిపి 'ట్రూఅప్' పేరిట అదనంగా వసూలు చేస్తూ వచ్చారు. 2022 ఆగస్టులో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ అదనపు వసూళ్లను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి రూ.25 కోట్ల చొప్పున మూడేళ్లలో రూ.75 కోట్ల భారం వినియోగదారులపై పడింది. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన కొనుగోళ్లు, వాస్తవ లెక్కలపై కూటమి ప్రభుత్వం సమీక్షించింది. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి ఇచ్చిన దాని కంటే డిస్కంలకు విద్యుత్ పంపిణీకి, మరమ్మతులకు అయిన ఖర్చు తక్కువగా ఉందని, ఆ మిగులు మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు విద్యుత్ వినియోగం ఆధారంగా యూనిట్‌కు 13 పైసల చొప్పున తగ్గించనున్నారు. నవంబరు నుంచి ఏడాది పాటు (అక్టోబరు 2026 వరకు) ఈ మేరకు తగ్గించి బిల్లులు ఇవ్వనున్నారు. వినియోగదారులకు దాదాపు రూ.23 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్ సర్వీసుల వివరాలు

- గృహ : 13,73,346
- వాణిజ్య : 1,61,215
- ఎల్‌టీ : 19,22,041
- పరిశ్రమలు : 21,117
- వ్యవసాయ : 3,17,709
- ప్రభుత్వ సర్వీసులు : 46,690
- హెచ్‌టీ : 1906

ఎలా తగ్గుతుందంటే..

ఏడాదికాలంలో వినియోగదారుడు 2400 యూనిట్లను వినియోగిస్తే దానికి సంబంధించి రూ.322 లబ్ధి కలుగుతుంది. 2024 ఏప్రిల్‌లో 200 యూనిట్ల కరెంటు వాడివుంటే ట్రూడౌన్ ఛార్జీలు రూ.26.86గా వస్తాయి. ఈ మొత్తాన్ని నవంబరు బిల్లులో సర్దుబాటు చేస్తారు. 2024 ఏప్రిల్‌లో వచ్చిన ఛార్జీలు నవంబరు, 2024 మేలో వచ్చినవి డిసెంబరులో సర్దుబాటు చేస్తారు. 2026 అక్టోబరు వరకు ఈ విధానం అమలవుతుంది.

రిజిస్ట్రేషన్ల జోరు

గత ఏడాదితో పోలిస్తే 13.36 శాతం వృద్ధి



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రాబడి పుంజుకుంది. గత ఏడాదితో పోలిస్తే వృద్ధి శాతం సైతం పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.221.88 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా, కేవలం రూ.149.88 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరింది. నిర్దేశించిన మొత్తంలో 67.55 శాతం మాత్రమే లక్ష్యం చేరుకోగలిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల కాలంలోనే రాబడి బాగా పుంజుకుంది.జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.106.90 కోట్లు రాబడి లక్ష్యం నిర్దేశించగా, రూ. 78.13 కోట్ల విలువైన రిజిస్ట్రేషన్లు జరిగి 73.09 వృద్ధిశాతం సాధించింది. గత ఏడాది తొలి ఆరునెలల కాలంలో రూ.68.92 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. లక్ష్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా... కుప్పం రూ. 10.95 కోట్లకు బదులు రూ. 11.33 కోట్లతో 103.50 శాతం వృద్ధి సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, రెండో స్థానంలో నిలిచిన నగరి రూ. 7.05 కోట్లకు బదులు రూ.7.10 కోట్లు (100.62 శాతం) సాధించింది. మూడో స్థానంలో చిత్తూరు రూరల్ రూ. 7.63 కోట్లకు గాను రూ.7.01 కోట్లు (91.95శాతం), పలమనేరు రూ.17.10 కోట్లకు గాను రూ.15.51 కోట్లు (90.66 శాతం), బంగారుపాళ్యం రూ.5.61 కోట్లకు గాను రూ.4.47 కోట్లు (79.74శాతం), పుంగనూరు రూ.15.08 కోట్లకు గాను రూ.9.67 కోట్లు (64.13 శాతం), కార్వేటినగరం రూ.5.33 కోట్లకు గాను రూ.2.90 కోట్లు (54.51 శాతం) సాధించగా, చిట్టచివరి స్థానంలో చిత్తూరు (అర్బన్) రూ.38.11 కోట్లకు గాను రూ.20.10 కోట్లు వసూలు చేసి 52.76 శాతంతో నిలిచింది. జిల్లాలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు గత నెలాఖరుకు 28,964 జరగ్గా, కుప్పంలో 6705 జరిపి ప్రథమ స్థానంలో నిలవగా, 4932తో పలమనేరు, 4812తో చిత్తూరు ఆర్వో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 1667 డాక్యుమెంట్లతో చిట్టచివరిస్థానంలో నగరి నిలిచింది. బంగారుపాళ్యంలో 1718, పుంగనూరులో 4182, కార్వేటినగరంలో 2033, చిత్తూరు రూరల్‌లో 2915 రిజిస్ట్రేషన్లు జరిగాయి. నిత్యం జిల్లావ్యాప్తంగా రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షల మేర ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలో 13.36శాతం వృద్ధి నమోదయ్యింది. భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంపు ద్వారా ఈ ఏడాది రూ.220 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ శాఖ అంచనా వేసింది.

CTBTA DATE 12-10-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 113/- డ్రెస్డ్ స్కిన్‌తో 205/-
రిటైల్ లైవ్ బర్డ్ 138/- స్కిన్‌లెస్ 230/-

వెంకటరమణ హార్ట్ & మెటర్నిటీ హాస్పిటల్
డి.నెం. 10-3-206/ఎ3/ఎ, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. 0877-2258183, 9490109100
ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా॥ సి.వెంకటరమణ ఎం.డి.,డి.ఎం.,(కార్డియాలజీ)
సంపూర్ణ గుండె చికిత్స
ఇసిజి, 2డి ఇకో & కలర్ డాప్లర్
పీడియాట్రిక్ (చిన్నపిల్లలు) గుండె స్కానింగు ✿ టియం.టి, హోల్టర్
ఏంజియోగ్రామ్, ఏంజియోప్లాస్టీ
పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్
వెంటిలేటర్ సదుపాయం
24 గం॥ ఐసియు
ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డా॥ ఆర్.నిరుపమ ఎం.బి.బి.ఎస్., డిజిఓ
EHS, WJHS, ALL TYPES OF INSURANCES AVAILABLE APSPDCL
24 గంటలు ఎమర్జెన్సీ, ICU Cathlab, CTOT, Advanced Surgical OT, Labour Room సౌకర్యం కలదు

పోలీసు కస్టడీకి గ్యాంగ్ రేప్ నిందితులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం కస్టడీకి తీసుకున్నారు.చిత్తూరు శివార్లలోని మురకంబట్టు నగరవనంలో బాలికను బెదిరించి గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన నిందితులను తాలూకా పోలీసులు అరెస్టు చేసి ఈ నెల 3వ తేది రిమాండ్‌కు తరలించారు.వారినుంచి మరింత సమాచారం రాబట్టడం కోసం పోలీసులు కస్టడీ కోరుతూ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో కోర్టు అనుమతి మేరకు శనివారం గ్యాంగ్‌రేప్ నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.



కడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ తెరపై ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు



కుప్పంలో ఏర్పాటు కానున్న డెయిరీ, పశువుల మేత యూనిట్ నమూనా చిత్రం

శ్రీజ డెయిరీకి ప్రధాని శంకుస్థాపన

కుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో శ్రీజ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థ రూ.219 కోట్లతో ఏర్పాటు చేయనున్న సమగ్ర డెయిరీ, పశు మేత తయారీ యూనిట్‌కు శనివారం ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దేశంలోని పలు రాష్ట్రాలలో కొత్త డెయిరీ ప్రాజెక్టుల ప్రారంభంలో భాగంగా ఈ వర్చువల్ శంకుస్థాపన జరిగింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ స్క్రీన్‌లో ఈ కార్యక్రమాన్ని పలువురు ప్రముఖులు వీక్షించారు. జాతీయ పాల అభివృద్ధి కార్యక్రమం (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్) పథకంతో కుప్పంలో స్థాపించనున్న ఈ డెయిరీ, పశువుల మేత యూనిట్ల స్థాపనతో గ్రామీణ పాల ఉత్పత్తి వ్యవస్థలకు ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహామండలి సభ్యులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చిత్తూరు డీఎస్‌డీవోగా ఉదయ్‌భాస్కర్

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎస్‌డీవోగా ఉదయ్‌భాస్కర్‌ను నియమిస్తూ శాప్ రాష్ట్ర ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లా డీఎస్‌డీవోగా ఉన్న ఈయన బదిలీపై జిల్లాకు రానున్నారు. ఇప్పటివరకు డీఎస్‌డీవోగా ఉన్న బాలాజీని చిత్తూరులోనే ఖోఖో కోచ్‌గా పోస్టింగ్ కేటాయించారు.

13 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడుపల్లెలో 58.4 మి.మీ, అత్యల్పంగా చిత్తూరు అర్బన్‌లో 2.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. కుప్పంలో 52, పెద్దపంజాణిలో 40.4, బంగారుపాళ్యంలో 37.4, గంగవరంలో 24.2, పలమనేరులో 18.8, బైరెడ్డిపల్లెలో 16.8, తవణంపల్లెలో 14.2, పుంగనూరులో 11.2, వి.కోటలో 7.4, పూతలపట్టులో 2.6, పెనుమూరులో 2.4 మి.మీ వర్షం కురిసింది.

సోమలలో ఎడతెరపిలేని వాన

- ఉధృతంగా గార్గేయ నది ప్రవాహం
- పెద్దఉప్పరపల్లెలో కొట్టుకుపోయిన కల్వర్టు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



పెద్దఉప్పరపల్లె వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

సోమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో శుక్రవారం రాత్రి ఎడతెరపి లేని వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పెద్దఉప్పరపల్లె-పలమనేరు మార్గంలోని తాత్కాలిక కల్వర్టు గార్గేయ నది ప్రవాహంతో కొట్టుకుపోయింది. దీంతో పేటూరు, బసవపల్లె, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతలపల్లె, బోనమంద, చిన్నకమ్మపల్లె, దుర్గంకొండ గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. పలు ప్రాంతాల నుంచి వంకలు గార్గేయ నదిలో కలవడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈక్రమంలోనే పలు గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు రాలేకపోతున్నారు. పెద్దఉప్పరపల్లె నుంచి పలమనేరుకు వెళ్లే ఆర్టీసీ సర్వీసును రద్దు చేశారు. అలాగే పెద్దఉప్పరపల్లె నుంచి చౌడేపల్లెకు వెళ్ల మార్గంలో దేవళకుప్పం వద్ద సీతమ్మ చెరువుకు వచ్చే వంక ఉధృతితో బయ్యారెడ్డిపల్లె, మేకలచిన్నేపల్లె, దేవళకుప్పం, చిన్నదేవళకుప్పం గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పెద్దఉప్పరపల్లె నుంచి రెడ్డివారిపల్లె, దుర్గంకొండ మార్గంలోని గార్గేయనది ఉధృతితో ఈమార్గంలోనూ ప్రయాణాలు స్తంభిచాయి. సోమల-పెద్దఉప్పరపల్లె మార్గంలోని సీతమ్మచెరువు మొరవ వద్ద భారీ నీటి ప్రవాహం వేగం పుంజుకుంది. వర్షం నీటితో నిండిన వేరుశనగ పంట కుళ్లిపోతోంది. బొప్పాయి, టమోటా పంటలకు తీవ్ర నష్టం జరిగింది. కోతలు చేయలేక మార్కెట్‌కు తరలించడానికి వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహంతోనా రాజకీయం?

కులాల మధ్య చిచ్చు పెడతామంటే ఊరుకోం - వైసీపీ నాయకులపై హోంమంత్రి అనిత ఫైర్



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న హోంమంత్రి అనిత

వెదురుకుప్పం/పెనుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళుతుండడం చూసి ఓర్వలేక జగన్ అండ్ బ్యాచ్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు.వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రెండు వారాల క్రితం అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ,దాన్ని టీడీపీ పైకి నెట్టేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన వైసీపీ నాయకుల కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే.వైసీపీకి చెందిన సర్పంచ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు చేసి జైలుకు పంపించారు.మరోవైపు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన రోజు సాయంత్రమే ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్ అక్కడ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో శనివారం హోంమంత్రి అనిత దేవళంపేటకు వచ్చారు. జోరు వాన కురుస్తున్నా చిత్తూరు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని సమాచారం రాగానే పోలీసులకు ఫోన్ చేసి వెంటనే దోషులను గుర్తించి వాళ్లు ఎవరైనా చర్యలు తీసుకోవాలని సూచించానన్నారు.చివరకు వైసీపీ నేతల కుట్ర అని తెలియడంతో ఆశ్చర్యపోయానన్నారు.డిప్యూటీ సీఎంగా పని చేసిన నారాయణస్వామి తమ దండుపాళ్యం బ్యాచ్‌తో వచ్చి టీడీపీ నేతలను అరెస్టు చేయాలని పోలీసులను కోరడంపై ఆమె మండిపడ్డారు.ఆయనకు వయసు పెరిగింది కానీ, బుద్ధి పెరగలేదని ధ్వజమెత్తారు.ధర్నాలు చేయడం, రెచ్చగొట్టడం, తగలబెట్టడం.... తీరా దొరికాక తమకేమీ తెలియదంటూ బుకాయించడం వైసీపీ నైజం అన్నారు.ఎక్కడైనా ఏవైనా జరగరాని సంఘటనలు జరిగినప్పుడు ఎలా జరిగింది, ఎవరు చేశారు అని నిర్ధారించుకున్నాకే కార్యాచరణకు దిగాలని దళిత సంఘాలకు ఆమె సూచించారు.అంబేకర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాష్ట్ర సమస్యగా చేయాలనుకున్న వైసీపీ కుట్రను భగ్నం చేసి నిజానిజాలను ప్రజలకు తెలియజేసిన చిత్తూరు పోలీసులను హోంమంత్రి అభిందించారు.'చిత్తూరులో గ్యాంగ్ రేప్ జరిగితే, ఆ నిందితుల్ని వెంటనే పట్టుకుని ముసుగు వేసి తీసుకెళ్లలేదు. బేడీలు వేసి నడిరోడ్డుపై నడిపించుకుంటూ వెళ్లారు' అంటూ ఆమె పోలీసులకు కితాబునిచ్చారు.రాజకీయ ముసుగులో వున్న నేరస్తులను గుర్తించి కటకటాల వెనక్కు పంపాలని సూచించారు.జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి డిప్యూటీ సీఎం దాకా ఎదిగిన నారాయణస్వామి తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తానంటూ దళిత ఆత్మగౌరవాన్ని జగన్ కాళ్ల దగ్గర పెట్టిన ద్రోహి అంటూ మండిపడ్డారు.ఎక్సైజ్ మంత్రిగా ఇష్టానికి దోచుకుని కుమార్తెలకు పంచిపెట్టిన ఆయన దళితులతో రాజకీయం చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.వాళ్లు ఒక్క విగ్రహాన్ని కాల్చితే తాము వెయ్యి విగ్రహాల్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అండగా దళితులున్నారని గ్రహించిన వైసీపీ నేతలు ఎస్సీ నియోజకవర్గాలను టార్గెట్ చేస్తూ దుష్టపన్నాగాలు మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక్కడ కాలిన మంట మరో చోటకు వ్యాపించకుండా ఉండాలంటే దోషులను శిక్షించడం మాత్రమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అందు కోసమే హోం మంత్రి దేవళంపేటకు వచ్చారన్నారు.మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ అన్ని జాతులవారూ కలిసి మొక్కాల్సిన దేవుడు అంబేద్కర్‌ను కూడా నీచ రాజకీయాలకు వాడుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, మాజీ ఎమ్మెల్యే గాంధీ,తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ నాగేశ్వరరాజు, టీడీపీ నేతలు రుద్రయ్య నాయుడు, జయశంకర్ నాయుడు, స్వామిదాస్, లోకనాథరెడ్డి, చెంగల్రాయయాదవ్,మోహన్ మురళి,తలారి రెడ్డెప్ప, శ్రీధర్ యాదవ్,గుణశేఖర్, హరీష్‌యాదవ్, మనోహర నాయుడు, ఇందిరమ్మ, రవిరాజు, తిరుమల, కుమార్, దశరథ, పీఏసీఎస్ చైర్మన్ సుధాకరరెడ్డి, ఎస్సీ మోర్చా నేత శేషాద్రికుమార్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథవాసు, పరమేశ్వరరెడ్డి, అశోక్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

న్యాయమూర్తులకు హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ సూచన



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌కు మొక్కను బహూకరిస్తున్న డీజే అరుణసారిక

చిత్తూరు లీగల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని న్యాయమూర్తులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సూచించారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని న్యాయమూర్తులతో ఆయన సమీక్షించారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కుదిరేలా తీర్పులు ఉండాలన్నారు. చట్టాలపై సమగ్రంగా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం తీర్పులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవలకు ధోకా లేదు

తిరుపతి/చిత్తూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేయాలని నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం పెద్దగా ప్రభావం చూపించలేదు.చిత్తూరులోని మూడు ఆస్పత్రుల్లో ఓపీ సేవల కోసం వచ్చిన వారిని రెండ్రోజుల తరువాత రమ్మని పంపేశారు.తిరుపతి జిల్లావ్యాప్తంగా 38 నెట్‌వర్క్ ఆస్పత్రులుంటే 4 ఆస్పత్రుల్లో మాత్రమే ఓపీ సేవలు నిలిచాయి.వీటిల్లోనూ అత్యవసర వైద్యసేవలకు ఎక్కడా ఆటంకం జరగలేదని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర రెడ్డి తెలిపారు.అత్యవసర శస్త్రచికిత్సల నిర్వహణలో ఆస్పత్రుల యాజమాన్యాలు అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

56 పాఠశాలల్లో టీచర్లు లేరు

21 బడుల్లో ఒక్కొక్కరే - 240పోస్టుల ఖాళీతో వి.కోటలో కుంటుపడిన విద్యాబోధన



కొంగాటం ఉర్దూ పాఠశాల

వి.కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధిక ఉన్నత పాఠశాలలు ఉన్న వి.కోట మండలాన్ని ఉపాధ్యాయుల కొరత దీర్ఘకాలంగా వేధిస్తోంది. మండల పరిధిలో 26 ఉన్నత పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత, 100 ప్రాథమిక పాఠశాలలు కలిపి మొత్తం 133 పాఠశాలలున్నాయి.9160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండలంలో మొత్తం 568 పోస్టులకుగాను 335 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, 233 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 56 పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకపోగా, 21 స్కూళ్ళలో ఒక్కో టీచరే విధులు నిర్వహిస్తున్నారు.టీచర్లు లేని స్కూళ్లకు పక్కనున్న బడుల నుంచి తాత్కాలికంగా పనిచేసేలా అధికారులు సర్దుబాటు చేస్తున్నారు.స్థానిక జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు జడ్పీ చైర్మన్‌గా వున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరతపై దృష్టి సారించకపోవడంతో మండలంలో విద్యావ్యవస్థ కుంటుపడింది.ఇటీవల జరిగిన బదిలీల్లో 110మంది టీచర్లు ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారు రాకపోవడంతో వీరిని రిలీవ్ చేయకుండా అదే స్థానంలో కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఉర్దూ మీడియం స్కూళ్లలో విద్యాబోధన కష్టతరంగా మారింది. కొంగాటం, నడిపేపల్లె, ఖాజీపేట, వి.కోట ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ మీడియంలో బోధించే టీచర్లు అందుబాటులో లేక పిల్లలు ప్రైవేటు బడుల వైపు మొగ్గుచూపుతున్నారు.ఈ ఏడాది డీఎస్సీకి ఎంపికైన టీచర్లను అయినా వి.కోట మండలానికి కేటాయించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


రేఖారాణి


హరితేజ

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ కమిషనర్ రేఖారాణి, సినీనటి హరితేజ, చెన్నై సిటీ కమిషనర్ అరుణ్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జస్టిస్ బీ కృష్ణమోహన్ - జస్టిస్ రవి చీమలపాటి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో జస్టిస్ బీ కృష్ణమోహన్, జస్టిస్ రవి చీమలపాటి దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,468
తలనీలాలు సమర్పించినవారు: 26,878



నేనున్నానని...


పిల్లలకు పిజ్జా తినిపిస్తూ..

చౌడేపల్లెకు చెందిన రెడ్డెప్ప పుట్టుకతో అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ స్కూల్లో పాటలు పాడటంలో నేర్పరి. ప్రేరణ సేవా సంస్థ ప్రోత్సాహంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఎంఎన్ఆర్ పాఠశాల అండ్ కళాశాలలో సంగీత ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

తిరుపతి బైరాగిపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లలకు సముద్రం చూడాలనే కోరిక కలిగింది. వారి కోరికను తీర్చేందుకు 'ప్రేరణ' ముందుకువచ్చింది. ఆనందసాగరంలో ముంచెత్తి వారితో సంతోషాన్ని పంచుకుంది.

శ్రీవెంకటేశ్వర డెఫ్ అండ్ డమ్ పాఠశాల విద్యార్థులకు 'ప్రేరణ' అందించిన శిక్షణ జీవితాల్లో వెలుగులు నింపింది.


సముద్రంలో జలకాలాడుతూ మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లల ఆనందం



ఎస్వీడీడీ పాఠశాల విద్యార్థుల నృత్యం


ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను ఆడిస్తున్న ప్రేరణ సభ్యులు


వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాటామంతి



ఆశ్రమంలో నిత్యావసరాలను అందిస్తూ..

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

18ఏళ్ల మానవతా ప్రస్థానంలో ఎందరికో చేదోడువాదోడు

ఆంధ్రజ్యోతి - తిరుపతి(కల్చరల్)

అసహాయులకు తోడుగా నిలుస్తోంది. ఆనందాన్ని పంచుతోంది. వారిలోని ప్రతిభకు పట్టం కడుతోంది. సేవకు ప్రతిరూపమై ప్రత్యేక ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది ప్రేరణ సేవా సంస్థ. ముగ్గురు విద్యార్థుల ఆలోచన ఫలితమే ఈ మానవతా సంస్థ ఆవిర్భావానికి బీజం వేసింది. తిరుపతిలోని శ్రీవిద్యానికేతన్‌లో బీఎస్సీ బయో టెక్నాలజీ చదువుతుండగా రాజశేఖర్, భార్గవి, విద్యాశ్రీలకు ఎదురైన అనుభవాలూ ఈ సంస్థ ఏర్పాటుకు కారణమైంది. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న బాలల్ని ఈ విద్యార్థులు చూశారు. చదువుకోవాల్సిన చిన్నారులు దారి తప్పిన తీరు తెలుసుకుని చలించిపోయారు. చదువుపై ఆసక్తి చూపిన వారికి పుస్తకాలు కొనిచ్చారు. కొంతమంది స్వార్థంతో ఇలాంటి పిల్లలు చెడు దారి పడుతున్నారని గుర్తించారు. బాధిత పిల్లలను చేరదీసి ఆశ్రమంలో చేర్పించారు. ఈ సంఘటనలు ఆ ముగ్గురు విద్యార్థులనూ సేవాపథం వైపు నడిపించాయి. 2008లో తమ కళాశాల అధ్యాపకులు శ్రీలత, రవీంద్రల ప్రోత్సాహంతో వీరు ప్రేరణ పేరిట హెల్పింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో సహచరుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించేవారు. ఏడాదిలోపు 43 మంది సభ్యులకు సంస్థ చేరింది. ఇప్పుడు సుమారు 300లకు పైగా సభ్యులతో బలమైన వృక్షంగా మారింది. ఈ సంస్థలో సభ్యులంతా విద్యార్థులే. వివిధ కళాశాలల్లో చదుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పం ఉన్నవారే.

ఎక్కడ ఉన్నా వీడని బంధం..

ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆరంభంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయినా ప్రేరణతో బంధం వీడలేదు. వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూనే తమ జూనియర్స్‌ను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తున్నారు. తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో రాజశేఖర్ తిరుపతి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్నారు. భార్గవి చెన్నైలో, దిగ్విజయ్ బెంగళూరులో పనిచేస్తున్నారు. ఇలా పలువురు ప్రేరణ సభ్యులు ఉద్యోగాలూ చేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా వార్షికోత్సవం వచ్చిందంటే రెక్కలు కట్టుకుని తిరుపతిలో వాలిపోతున్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, సంగీత కార్యక్రమాలు నిర్వహించి వారితో సంతోషాలను పంచుకుంటున్నారు.

ఓ విద్యార్థిని కోసం వార్షికోత్సవం..


రెడ్డెప్ప

తొలి ఏడాది సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నవజీవన్ బ్లైండ్ స్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలో రోజా అనే విద్యార్థిని బాధపడుతూ కనిపించింది. జ్వరం జలుబు, దగ్గు కారణంగా పోటీల్లో బాగా పాడలేకపోయానని రోదించింది. ప్రేరణ సభ్యుల్లో ఒకరైన భార్గవి ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుంది. మంచి వేదికపై పాటపాడే అవకాశం కల్పిస్తామని మాటిచ్చింది. దాంతో ఆ విద్యార్థిని పట్టలేని ఆనందంతో గంతేసింది. ఆ అమ్మాయికి ఇచ్చిన హామీ నెరవేర్చాలనే క్రమంలో పుట్టుకొచ్చిందే తొలి వార్షికోత్సవ నిర్ణయం. వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆర్థికంగా స్థోమత లేకున్నా ధైర్యంగా ముందడుగు వేశారు. తమ తరగతితో పాటు ఇతర తరగతులు.. వివిధ విద్యాసంస్థల్లో విరాళాలు సేకరించారు. మొత్తం మీద తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేదికపై రోజా కమ్మని గీతంతో అందరి హృదయాలను దోచుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటి టీటీడీ ఈవో కేవీ రమణాచారి ప్రేరణ సేవలను అభినందించారు. మహతిలో ఎప్పుడు కార్యక్రమం నిర్వహించాలన్నా ఉచితంగా అవకాశం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. 2008లో తొలి ఏడాది వార్షికోత్సవంలో అందిన ప్రోత్సాహంతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంది 'ప్రేరణ' సేవా సంస్థ.



ప్రేరణ సభ్యులు

మురికి కాలువలో పసికందు




తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో ఇంకా కళ్లు కూడా తెరవని పసికందును మురికి కాలువలో పడేసింది. తిరుపతి సింగాలగుంటలోని మసీదు వీధిలో కాలువలో పడి ఉన్న ఆ పసికందు శవాన్ని అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. స్థానిక వీఆర్వోకు సమాచారం అందించారు. వీఆర్వో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ అజిత అక్కడికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

- ఉన్నత విద్యకూ అవకాశం

తిరుపతి(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంతోపాటు కంపెనీ ఆర్థిక సాయంతో ఉన్నత చదువులు చదివే అవకాశం కూడా కల్పించనున్నారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పెద్దగా ఉద్యోగావకాశాలు ఉండని క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంటర్ విద్యామండలి హెచ్‌సీఎల్ ద్వారా ఈ మేళాను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్, ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 2024, 2025 సంవత్సరాల్లో కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టెక్‌బీ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి సంవత్సరంపాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి నెలకు రూ.2.20 లక్షల జీతంతో ఉద్యోగం లభిస్తుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://bit.ly/TechbeeGoAP లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు 13వ తేదీన ఎంపికల సమయంలో కంపెనీ ప్రతినిధులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇతర వివరాలకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధి ఎన్.రాజ్‌కుమార్‌ను 7780323850లో సంప్రదించవచ్చునని వివరించారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో వెంగమాంబ అన్నప్రసాద భవనం వెలుపల గేటు వద్ద అచేతనంగా పడి ఉండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ముక్కంటి ఆలయంలో 22నుంచి కార్తీక మాస పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయం తెరచు వేళలు, సోమవారం రోజున ప్రాతఃకాల అభిషేకాలు, పవళింపు సేవల సమయాలలో మార్పులు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. మోహనమంత్ర




ఉర్రూతలూగిస్తున్న డీజే - పాల్గొన్న విద్యార్థులు - కేరళ వాయిద్యాలను తిలకిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహనమంత్ర కార్యక్రమం రెండవ రోజు శనివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. హర్రర్ హౌస్, కళాక్షేత్ర, రాంప్‌వాక్,ఫొటోషూట్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రెయిన్, ట్రెజర్ హంట్ తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం డీజే పరోమా (ముంబై) ప్రొ షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా ఎంబీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగరాజరామారావు మాట్లాడుతూ నిర్వహించిన వర్క్‌షాపులు విద్యార్థుల మేధోసంపత్తికి దోహదపడ్డాయన్నారు. కాగా కళావేదికపై విద్యార్థులు నిర్వహించిన నృత్య గాన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. టెక్నికల్ విభాగంలో రోబోవార్స్ కార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సందడి చేశారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గువ్వలకాలనీలో శ్రీహరి హత్య కేసులో నిందితుడు ఎస్.మేస్త్రీ(33)ని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ ఎం.మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. మేస్త్రీ భార్య భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో శ్రీహరి మేస్త్రీని హేళనగా మాట్లాడాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం టిఫిన్ సెంటర్ వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో మేస్త్రీ తన జేబులో నుంచి కత్తిని తీసి శ్రీహరి మెడపై పొడవంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీహరి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.


నిందితుడు మేస్త్రీని అరెస్టు చేసిన పోలీసులు

21 ఎర్రచందనం దుంగల స్వాధీనం



మంగళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం గొల్లపల్లి బీట్ పరిధిలో శనివారం తిరుపతి అటవీ శాఖ అధికారులు కూంబింగ్ నిర్వహించి పొదల్లో దాచి ఉంచిన 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి వడమాలపేట మండలం పాదిరేడు సెక్షన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా గొల్లపల్లి వద్ద పొదల్లో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలు అధికారుల కంటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, బీట్ ఆఫీసర్లు మునినాయక్, జ్యోతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుల నియామకం

శ్రీకాళహస్తి, అక్టోంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డులో ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితుల పేర్లతో అధికారులు శనివారం అధికారిక జీవోను విడుదల చేశారు. చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడికి అవకాశం కల్పించారు.

పంట పొలాలపై 'గజ'దాడులు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లంపల్లె గ్రామ అటవీ ప్రాంత సమీప పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. సాయంత్రం 6 గంటలకు ఏనుగుల గుంపు పులిచెర్ల అడవుల్లో నుంచి యల్లంపల్లె అటవీ ప్రాంతంలోకి చొరబడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో 8 ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుండటంతో గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు, గ్రామస్తులు కలిసి ఏనుగులు గ్రామంలోకి రాకుండా బాణసంచా పేల్చుతూ, డప్పులు వాయించారు. జ్ఞానప్రకాష్‌రెడ్డికి చెందిన వరి పైరును పూర్తిగా ధ్వంసం చేశాయి. పక్క పొలంలో ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేశాయి. శనివారం వేకువజాము వరకు అవి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే తిరుగుతుండటంతో యల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు ఇటువైపు రాకుండా అడ్డుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇరిగేషన్ పైపులైన్

ఆకట్టుకున్న శోభారాజ్ గాత్రకచేరి



శ్రీవారి సహస్రదీపాలంకార సేవలో ప్రముఖ గాయని శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామికి జరిగిన సహస్రదీపాలంకార సేవలో ఆమె పాల్గొన్నారు. శిష్య బృందంతో కలిసి శ్రీవారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుత 'అన్నమయ్య గాయత్రి' మంత్రంతో ప్రారంభించి 'హరియవతారమీతడు అన్నమయ్య', 'ఈరూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము' అను కీర్తలను రసరమ్యభరితంగా ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం కానుక


అభిషేక సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం అభిషేక సింహాసనం బహూకరించారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, యువజ్యోతిలు సుమారు రూ.9 లక్షల విలువ గల బంగారు పూత కలిగిన రాగి అభిషేక సింహాసనాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చకులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసు

సత్యవేడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీకి ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ అతని భార్య తేజశ్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్రతోపాటు పట్టాలు పొందిన పీ.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్ పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తిరుపతి-అనకాపల్లి మధ్య 2 నుంచి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి ఆదివారం, అనకాపల్లిలో ప్రతి సోమవారమూ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు (07481) ఆదివారం బయలుదేరి అనకాపల్లికి మరుసటి రోజు(సోమవారం) చేరుకుంటుంది. అదేరోజు ఈ ప్రత్యేక రైలు (07482) అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.



తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయ రాజగోపురం

ఐదు సెంట్లు హాంఫట్

తిరుపతి ఆలిండియా రేడియో కార్యాలయం వెనుకవైపు ఒకే ఆవరణలో తిరుపతి అర్బన్, రూరల్ మండలాల తహసీల్దారు కార్యాలయాలున్నాయి. వాటికి చుట్టూ ప్రహరీ కూడా ఉంది. ఆ కార్యాలయాలకు చుట్టూ అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. పలు శాఖల కార్యాలయాలున్నాయి. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వాయువ్య మూల పదేళ్ల కిందట వెంకటేశ్వరస్వామి ఆలయం పేరిట చిన్న మందిరం నిర్మించారు. చూస్తుండగానే ఆ మందిరానికి చుట్టూ ప్రహరీ ఏర్పడింది. ఆపై ధ్వజస్తంభం, తర్వాత బలిపీఠం.. ఇలా అంతకంతకూ మందిరం ఆలయంగా ఆవిర్భవించింది. ఆవరణలో ఒక మూలకు పరిమితమైన మందిరం కాస్తా ఇపుడు ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసింది. తహసీల్దారు కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చునేందుకు ఆవరణలో వేపచెట్టు, దానిచుట్టూ అరుగు ఉండగా ఆలయానికి అడ్డుగా ఉందని చెట్టును నరికివేయించి, అరుగు కూడా తొలగించేశారు. తాజాగా రాజగోపురం కూడా నిర్మించారు. రెండు సెంట్లలో ఉన్న మందిరం ఇప్పుడు ఐదు సెంట్లకు విస్తరించింది. కార్యాలయానికి జనం రాకపోకలను కూడా అసౌకర్యంగా మార్చేశారు. ఇదంతా ఆవరణలో సంగతి.



అర్బన్ తహసీల్దారు కార్యాలయానికి పడమరగా రోడ్డు పక్కన నిర్మించిన స్టోర్ రూమ్

తిరుపతిలో రెవెన్యూ దేవస్థానం

అది ప్రభుత్వ కార్యాలయ ఆవరణ. ఒక మూలన చిన్న మందిరం రేకుల షెడ్డులో వెలిసింది. పనులపై వచ్చీపోయేవాళ్లు దణ్ణం పెట్టుకుంటారులే అనుకున్నారు. నిదానంగా అది ఆలయంగా మారిపోయింది. గుడి, గోపురం, ప్రాకారం, వాహన మండపం.. ఇలా ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిలో అన్ని హంగులూ ఏర్పడ్డాయి. అంతటితో ఆగకుండా రోడ్డునూ, ప్రాకారం బయట ప్రాంతాన్నీ కూడా ఆక్రమించేస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆఫీసులో ఇదేమిటని అడిగేవాళ్లు మాత్రం లేకపోవడమే విచిత్రం.

ఆ పేరుతో ఖరీదైన ప్రభుత్వ భూముల ఆక్రమణ

దారులు కూడా మూసేసి ఇష్టారాజ్యంగా నిర్వహణ

ఆలయ నిర్వహణకు చందాల వసూలు

పట్టించుకోని అధికార యంత్రాంగం



అర్బన్ తహసీల్దారు కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద ఆలయం

తిరుపతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఓ చిన్నపాటి మందిరంగా నిర్మితమైన వెంకటేశ్వరస్వామి దేవాలయం పేరిట చుట్టుపక్కల ఖరీదైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. తొమ్మిదేళ్ల వ్యవధిలో కార్యాలయ ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసిన నిర్వాహకులు ఆపై ప్రహరీ దాటి వెలుపల కూడా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలకు వెళ్లే దారులు సైతం మూసేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో బహిరంగంగా ఈ తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విచిత్రం.


ఖరీదైన భూముల ఆక్రమణ

తహసీల్దారు కార్యాలయానికి వెలుపల ఉత్తర, పడమర దిశల్లో రోడ్లు, వాటిని ఆనుకునే అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. కార్యాలయం ముందు ఉత్తర దిశగా ఉన్న రోడ్డుకు శాశ్వతంగా రేకులతో పందిళ్లు వేసేశారు. రోడ్డుకు ఉత్తరంగా ఖాళీ స్థలంలో వాహన మండపం ప్రత్యక్షమైంది. పడమర ఖాళీ స్థలంలో కూడా వాహనాలు భద్రపరిచేందుకు, ఇతర వస్తువులు ఉంచేందుకు స్టోర్ రూమ్ వెలిశాయి. ఉత్తరంగా ఉన్న రోడ్డు ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచీ తహసీల్దారు కార్యాలయం మీదుగా జిల్లా గ్రంథాలయ సంస్థ, జీఎస్టీ, డీఆర్‌డీఏ తదితర కార్యాలయాలతో పాటు జిల్లా పోలీసు కార్యాలయానికి వెళుతుంది. ఉత్సవాల పేరిట తరచూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఈ రోడ్డును మూసివేసి డైవర్ట్ చేస్తున్నారు. పడమర వైపు రోడ్డు యూత్ హాస్టల్, డ్వామా కార్యాలయాలతోపాటు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు వెళుతుంది. 40 అడుగుల ఈ రోడ్డును సగం ఆక్రమించేశారు. ఉత్సవాల పేరిట ఆ రోడ్డును కూడా రోజుల తరబడీ మూసేస్తున్నారు. దీనిపై యూత్ హాస్టల్ అధికారులు పలుమార్లు అభ్యంతరం తెలిపినా ఉపయోగం లేకుండాపోయింది. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అనుమతి లేకున్నా..

తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిర్మితమై అంతకంతకూ విస్తరిస్తున్న ఆలయానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులూ లేవు.అయితే ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరయ్యాయనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ సంబంధిత పనులపై వచ్చే వారి నుంచి ఆలయం పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

చిన్నారి తలకు అధునాతన శస్త్ర చికిత్స





సర్జరీతో కోలుకున్న చిన్నారి

కుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు తలకు తగిలిన దెబ్బ ప్రాణాంతకంగా మారిన చిన్నారికి పీఈఎస్ ఆస్పత్రిలో అధునాతన శస్త్ర చికిత్స చేసి మెరుగైన జీవితాన్ని ఇచ్చినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆడుకుంటూ గాయపడ్డ ఓ బాలికకు వారం రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. అధిక వాంతులు, తలనొప్పి, చూపు మందగించడం, తలకు కుడి భాగంలో వాపురావడం వంటి లక్షణాలతో పీఈఎస్‌కు తల్లిదండ్రులు తీసుకొచ్చిన చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దీంతో చిన్నారి మెదడుకు కుడివైపు 70 సీసీ పరిమాణంలో పెద్ద ఫ్రంటల్ ఎక్స్‌ట్రా డ్యూరల్ హెమటోమా (ఈడీహెచ్) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇది మెదడుపై ప్రాణాంతక ఒత్తిడి కలిగిస్తుందని, హెమటోమా అనేది పుర్రె పగులు కారణంగా ఏర్పడిందని గుర్తించారు. పీఈఎస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జరీ, యోగ, న్యూరో సైన్స్ అధిపతి డాక్టర్ వినయ్ కాకు నేతృత్వంలో చిన్నారికి అత్యవసర శస్త్ర చికిత్స నిర్వహించి ఎక్స్‌ట్రా డ్యూరల్ హెమటమాను విజయవంతంగా తొలగించారు. దీంతో చిన్నారి నాడీ వ్యవస్థ పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షించిన పీఈఎస్ సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ వైద్య బృందాన్ని ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

మొరవపోతున్న దేవదొడ్డి చెరువు

● వంకల్లో నీటి ప్రవాహంతో గ్రామస్తుల అగచాట్లు



దేవదొడ్డి వద్ద తాడు కట్టుకుని వంక దాటుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవదొడ్డి పెద్దచెరువు నిండి మొరవపోతోంది. చెరువు నిండిందని గ్రామస్తులు ఒక వైపు సంతోషిస్తున్నా మొరవ నీరు పొలాలకు వెళ్లేదారిలో ప్రవహిస్తుండటంతో వెళ్లడానికి అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంకలో మొరవనీటి ప్రవాహం అధికంగా ఉండడంతో తాడు కట్టుకుని సాహసం చేస్తూ వంక దాటుతున్నారు. దాదాపు 25 కుటుంబాల వారు చెరువు పరిసర ప్రాంతాల్లో పంటలు సాగుచేసుకుంటున్నారు. ఆవులు, మేకలు మేపడానికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు వంక దాటి వెళ్లడానికి సాధ్యంకాని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవతీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటి విడుదల



పెనుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయం ఆరు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. భారీ వర్షాలకు జలాశయం నిండటంతో 15వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఏఈ భరత్ తెలిపారు. వాహనాలను బ్రిడ్జిపైకి మళ్లించి, ప్రమాదాలు జరగకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులతో పర్యవేక్షిస్తున్నారు.

462 గ్రాముల బంగారం చోరీ



సీసీ కెమెరాలో అనుమానితుడు

రామకుప్పం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కుప్పం-పలమనేరు జాతీయ రహదారికి చేరువలోని చెల్దిగానిపల్లెలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. చెల్దిగానిపల్లెకు చెందిన గోవర్ధన్ సేద్యం చేసుకుంటూ పాడిఆవులు పోషిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటలకు పశుగ్రాసం కోసం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గ్రామ శివార్లలోని పొలం వద్దకు వెళ్లాడు. 10 గంటలకు ఇంటికొచ్చి తాళం తీసుకొని ఇంట్లోకి వెళ్లగానే బీరువా తెరిచి ఉంచడాన్ని గమనించారు. బీరువా లోపల బంగారం చోరీకి గురైనట్టు గుర్తించారు. తలుపు పైభాగంలో ఉన్న తాళం చెవితో తాళం తెరిచి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు తిరిగి తలుపుకు తాళం వేసి వెళ్లిపోయారు. బీరువాలోని 462 గ్రాముల బంగారు నగలను దుండగులు చోరీ చేసి తీసుకెళ్లారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారులో వచ్చి, వెళ్లారని స్థానికులు తెలిపారు. వారిలో ఓ నిందితుడు చోరీ జరిగిన ఇంటి నుంచి వెళ్తుండగా పొరుగింట్లోని సీసీ కెమెరాలో ఆ దృశ్యం రికార్డయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు నుంచి క్లూస్‌టీం సభ్యులు చెల్దిగానిపల్లెకు చేరుకొని చోరీ జరిగిన ఇంట్లో నిందితుల వేలిముద్రలను సేకరించారు.

పంటలపై గజ బీభత్సం

● కొబ్బరి, మామిడి, వరి, అరటి పంటలకు తీవ్రనష్టం



కల్లూరులో ధ్వంసమైన అరటిచెట్లు

కల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజు బీభత్సం సృష్టించింది. పాతపేట, కల్లూరు, పాళెం పంచాయతీల్లో శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేయడంతో కొబ్బరి, మామిడి, అరటి, బొప్పాయి, వరి పంటలకు అపారనష్టం వాటిల్లింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు ముందుగా కల్లూరు ఘాట్ సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకుంది. షాజాహాన్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసి కల్లూరు-గంటావారిపల్లి రోడ్డును దాటుకొని పాతపేట వద్దకు చేరుకుంది.అరటి, మామిడి, కొబ్బరి, బొప్పాయి పంటలను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి ఎద్దులవారిపల్లి చేరుకుని మామిడిచెట్లను ధ్వంసం చేసింది. శనివారం వేకువజామున బీఎంసీ గోడౌన్ సమీపంలో హైవేను దాటుకొని పాళెం పంచాయతీలోకి అడుగుపెట్టింది.వరి, మామిడిచెట్లను ధ్వంసం చేసింది. పశుగ్రాసాన్ని తినేసి సమీపంలోని రాతికూసాలను విరిచేసింది.అక్కడినుంచి జూపల్లి సమీపంలోని తూర్పు విభాగం అటవిలోకి వెళ్లిపోయింది. శనివారం పగలంతా చింతలవంక సమీపంలో తిరుగుతున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

సోమలలో ఆగని గజదాడులు



ఇర్లపల్లె సమీప అడవిలో తిరుగుతున్న ఏనుగులు

సోమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో గజదాడులు ఆగడంలేదు. కొంత కాలంగా మండలాన్ని వీడి పులిచెర్ల మండలం వైపు వెళ్లిన ఏనుగులు ఏదో ఒక సమయంలో మండలంలోకి ప్రవేశించడం పరిపాటిగా మారింది. శుక్రవారం రాత్రి ఆవులపల్లె పంచాయతీలోని కొత్తూరు, పత్రపల్లె సమీపంలో పలు పంటలను ధ్వంసం చేశాయి. మామిడి, బొప్పాయి తోటల్లో , పశుగ్రాస క్షేత్రాల్లో సంచరించడంతో రైతులు నష్టపోతున్నారు. పెద్దఉప్పరపల్లె-సోమల రోడ్డు మార్గంలోనే తిరుగుతుండడంతో ఈ మార్గంలో రాత్రి వేళ ప్రజలు వాహనాల్లో తిరిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇర్లపల్లె సమీప అడవిలో శనివారం పశువుల, మేకల కాపర్లు ఐదు ఏనుగుల సంచారాన్ని గమనించారు. ఈక్రమంలోనే టమోటా తోటల వద్ద ఏనుగులు ప్రవేశించకుండా మంటలు వేసుకుంటూ జట్లుగా తిరుగుతున్నారు. పగలు సమీప అడవుల్లో తిరుగుతూ రాత్రి పొలాల్లోకి ప్రవేశిస్తున్నట్లు రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు మాత్రం రైతులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు.



కొత్తూరు సమీపంలో ధ్వంసమైన వరి పంట

భక్తులతో కిక్కిరిసిన కలిగిరి కొండ



భక్తులతో కిక్కిరిసిన కొండ



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు

పెనుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని కలిగిరి కొండ శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఏటా పెరటాసి నెల ఐదు శనివారాలు ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా నాల్గవ శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయమే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు చేశాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవిందనామస్మరణతో మార్మోగింది. ప్రధాన అర్చకుడు వాసుదేవాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

హోంమంత్రి వ్యాఖ్యలు దారుణం : నారాయణస్వామి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేవళంపేటలో హోంమంత్రి అనిత మాటలు దారుణంగా ఉన్నాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చేంత దిగజారుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు.ఈ ఘటనపై సీబీఐ ఎంక్వయిరీ వేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, SHAIK SHENABANU (Old Name), D/o . SHAIK MAHABOOB BASHA , R/o:13-102, Ambedkar Colony, Auto Nagar, Renigunta Road, TIRUPATI - 517 507 , TIRUPATI DIST , A.P., Hereby declare that I have changed my name as BODEBOYGARI SHAHINA BHANU (New Name), W/o. BODEBOYGARI JAMEER BASHA .
AJT - 1715

PASSPORT LOST
I, BHANUPARAKASH PANDIPATI S/o P.VENKATARAMANAIH. I have lost my passport (HYDR08731692) while House shifting from 19-3-1-C6/2 Garudadri Nagar, Tirupati-517501. If anyone finds it, please contact 9963198295. A reward will be given to the person who returns it.
AJT - 1714

WANTED
ఆఫీసులో పనిచేయుటకు ఫ్రెషర్స్ కావలెను. కంప్యూటర్స్ నాలెడ్జి ఉండి ఇంటర్ టు డిగ్రీ ఉన్నవారు సంప్రదించండి. నెలకు జీతం: 6-9వేల రూ./ ప్రతిరోజు పాంప్లెట్స్ పంచడానికి ఫ్రెషర్స్ కావలెను. జీతము: 3వేల రూ. (డైలీ 2గం). సెల్: 8331857429.
AJT -1717

WANTED
తిరుపతి, కరకంబాడి రోడ్, తాహిర్ మండి ఫ్యామిలీ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన(యువతి/యువకులు) రిసెప్షనిస్ట్, క్యాషియర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.సెల్: 99488 49820,91212 64706.
AJT -1718

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాలు నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 239969

DISTANCE EDUCATION
Direct 10th, one sitting inter, degree, P.G చేయాలనుకుంటున్నారా! Online, Offiline ద్వారా పాస్ చేయించబడును.సంప్ర: 83175 41400, తిరుపతి.
AJT - 246455

కంప్యూటర్లు - ల్యాప్‌టాప్స్
కొత్త కంప్యూటర్లు 1సం. వారంటీతో, సెకండ్స్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్స్ 3 నెలల వారంటీతో అమ్మబడును. పాతవి అప్‌గ్రేడ్ సర్వీసింగ్ చేయబడును. సంప్ర. ఎస్.వి.కంప్యూటర్స్. తిరుపతి. 83175 09381.
AJT - 1622

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 246951

CHANGE OF NAME
I, RAKESH SAGARMAL (Old Name), S/o. SAGARMAL MOHANLAL , R/o:8-3-329, New Street, TIRUPATI -517 501 ,TIRUPATI DT , A.P., Hereby declare that I have changed my name as RAKESH KUMAR SAGARMAL (New Name), S/o. SAGARMAL MOHANLAL .
AJT - 1713

WANTED
V బిల్డ్ హోమ్స్ నందు పనిచేయడానికి టెలికాలర్స్ & మార్కెటింగ్ పర్సన్స్ కావలెను. జీతం: 12,000 టు 20,000. సంప్రదించండి: 96665 99828, 99636 50506.
AJT -246088

WANTED
తిరుపతి రైల్వేస్టేషన్ ఎదురుగా ప్రముఖ లాడ్జి నందు పనిచేయుటకు అనుభవం గల రిసెప్షన్ మేనేజర్ కావలెను. సంప్ర: 94936 62299.
AJT -1716

PLOT FOR SALE
కుర్రకాలవ వాసు దేవరాజు లే-అవుట్, తిరుపతి ఎయిర్‌పోర్టు దగ్గర 36x60=60 అం., ఈస్ట్ ఫేసింగ్ తుడా అప్రూవల్ ప్లాట్ అమ్మబడును. ఒక అంకణం 65000, డైరెక్ట్ ఓనర్. 80724 85342
AJT - 1700

PLOT FOR SALE
తిరుపతి రేణిగుంట ఇంటర్నేషనల్ Airport తుడా ఫైనల్ అప్రూవడ్, సిగ్నేచర్ గార్డెన్స్ ఎదురుగా, ఎలక్ట్రానిక్స్ సిటీ ప్రక్కన సెమి కమర్షియల్ ఫ్లాట్స్ అమ్మబడును. నేరుగా సంప్ర:80967 83848.
AJT -1698

PLOT FOR SALE
TUDA Plots for sale in Emerald Green near Kammapalle. Thanapalle Road, 8 KMs from Taj Hotel, Rs. 50,000 Ankanam. Cont. Cell : 8152012345 / 9491774041
AJT - 1621

WANTED
ఈశ్వర్ ఏజెన్సీ చంద్రగిరి నందు పనిచేయుటకు అనుభవం గల టెలికాలర్స్ (M/F) కావలెను. జీతం 25K+More ఇన్సెంటీవ్స్. సెల్: 94410 74755
AJT -1679

FLATS FOR SALE
తిరుపతి రాయల్ నగర్‌లోని StanFord స్కూల్ దగ్గర లీలావతి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ నందు 1st ఫ్లోర్ & Vth ఫ్లోర్‌లో New 3BHK ఫ్లాట్స్ అమ్మబడును. సెల్: 94401 25454
AJT - 1649

HEALTH CARE
డా॥కె.కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT - 1703

CHANGE OF NAME
I, MOGAL THOUHIDA BANU, W/o MOGAL ARSHAD ALLI, R/at D.No. 4-114-82-5, Rahamath Nagar, Eswaramma Colony, Madanapalle T&M, Annamayya Dist, AP, hereby declare that I have changed my name to MIRZA THOUHIDA BANU, W/o MIRZA ARSHAD ALI. Henceforth, I shall be known as MIRZA THOUHIDA BANU for all purposes.
AJT - 1712

CHANGE OF NAME
I,BALLAPURAM KALAVATHAMMA (Old Name), W/o LATE PENUMURU SUBRAMANYAM, R/o : No.5, F Type, Vinayaka Nagar, Tirupati, Tiruapti Dt , A.P., Hereby declare that I have changed my name as P.SURYAKALA (New Name), W/o. LATE PENUMURU SUBRAMANYAM.
AJT - 1711

CHANGE OF NAME
I, PASUPULETI SIVA PRASAD (Old Name), S/o. P. SUBBARAYUDU, D.No: 22-5-155/ MRT/501, Muni Reddy Towers, Sujatha Nagar, Kothapalli, Sri Sai Vishnu Layout, Tirupati Urban, Pin Code:517507. I Changed my name to PASUPULETI SHIVA PRASAD. Henceforth, I will be Known as PASUPULETI SHIVA PRASAD. 9703234777.
AJT - 239930

LAND FOR SALE
తిరుపతి- చెన్నై నేషనల్ హైవే పుత్తూరుకి అతి సమీపంలో ACJ కళ్యాణమండపం ఎదురుగా హైవే ఆనుకుని 55,000 చ॥అ॥ స్థలం అమ్మబడును. సెల్: 98490 51757, 94405 85225.
AJT -1721

HOUSE FOR SALE
జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ, మసీదు పక్కన, ఉత్తరం మరియు దక్షిణం ముఖముల 30 అంకణాల ఇల్లు అమ్మబడును. సంప్ర. : 96423 41823
AJT - 246087

వాటర్ ప్రూఫింగ్
స్లాబ్ లీకేజీలు, బాత్రూమ్ లీకేజీలు, వాటర్ ట్యాంక్ లీకేజీలు, గోడ చెమ్మలకు పగలకొట్టకుండా గ్యారెంటీగా వర్క్ చేయబడును. సంప్రదించండి. సెల్: 93465 40767
AJT -240225

Lease కు ఇవ్వబడును
తిరుపతిలోని రేణిగుంట రోడ్డు నందు నిస్సాన్ కారు షో రూమ్ ప్రక్కన (నారాయణాద్రి) హాస్పిటల్ ఎదురుగా గల 106x82 కొలతలు గల ఖాళీ జాగా Rent / Lease కు ఇవ్వబడును. సంప్ర. : 9440881396
AJT - 239988

WANTED
Teachers Higher Biology and Hindi Full or Part-Time primary all subjects fluency in English is must RTS Olympiad & IIT School Mangalam, Tirupati. Salary negotiable. Ph: 78931 13557.
AJT - 2362

క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఉధృతంగా బేతమంగళం చెరువు మొరవ

● పాలారుకు చేరుకోనున్న కర్ణాటక వరద నీరు



ఉధృతంగా కర్ణాటక సరిహద్దులోని బేతమంగళం చెరువు మొరవ ప్రవాహం

రామకుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో కొనసాగుతున్న భారీ వర్షాలతో రాష్ట్ర సరిహద్దుల్లోని చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఈ వరదనీరు నాలుగు రోజుల్లో రామకుప్పం మండలం కొళ్లపల్లె వద్ద ప్రారంభమయ్యే పాలారు నదికి చేరుకోనున్నాయి. ప్రస్తుతం కర్ణాటక ఎగువప్రాంతాల్లో చెరువులన్నీ నిండి మొరవ ప్రవాహాలు ఉధృతంగా సాగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రికి వరదనీటితో సరిహద్దుల్లోని సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలోని బేతమంగళం చెరువు నిండి మొరవ పారుతోంది. ఆ మొరవ ప్రవాహం రామసముద్రం చెరువుకు చేరుతోంది. మరో మూడు రోజుల్లో రామసముద్రం చెరువు నిండే అవకాశముంది. ఆ చెరువు నిండితే మొరవ ప్రవాహం వి.కోట మండలం కొంగాటం మీదుగా కొళ్లపల్లె వద్ద గల పాలారు నదిలోకి చేరుతుంది. మంగళవారం నాటికి వరదనీరు కొళ్లపల్లె వద్ద పాలారు నదికి చేరుకుంటుంటుందని స్థానిక రైతులు తెలిపారు. నాలుగేళ్లుగా పాలారు నది ప్రవహించక పోవడం, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లోని పాలారు నదీ పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి రైతులు పంటల సాగులో ఇబ్బందులకు గురయ్యారు. ఒకసారి పాలారు నది ప్రవహిస్తే ఈ ప్రాంతంలో రెండేళ్లపాటు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. ఈసారి కర్ణాటకలో భారీ వర్షాల పుణ్యమా అని పాలారుకు జలాలు రానుండటంతో ఈ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ మల్లికార్జున

కల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీలందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున స్పష్టం చేశారు. పులిచెర్ల మండలం మతుకువారిపల్లి పంచాయతీలో సిబ్బంది చేపడుతున్న ఈకేవైసీని శనివారం అడిషనల్ పీడీ మల్లికార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. కూలీల హాజరులో పారదర్శకతను పెంచడం, నకిలీ హాజరును అరికట్టడం ఈకేవైసీ ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలోని బోడిరెడ్డిగారిపల్లి, అయ్యావాండ్లపల్లి, పోశంవారిపల్లి పాళెం పంచాయతీల్లో సుమారు 90 శాతం ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. యల్లంకివారిపల్లి, రాయవారిపల్లి, మంగళంపేట పంచాయతీ ఈకేవైసీ ప్రక్రియలో వెనుకబడి ఉందన్నారు. మండలంలో ఇప్పటివరకు ఈకేవైసీ ప్రక్రియ 60 శాతం పూర్తయిందన్నారు. ఈకేవైసీ ప్రక్రియలో 90శాతం ఫలితాలు సాధించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో సౌభాగ్యవతి, టీఏ జ్యోతీశ్వర్‌రెడ్డి, ఎఫ్ఏలు, కూలీలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనాలు

● ఆక్రమణల పాలవుతున్న స్థలాలు



కుమ్మరివీధిలో మూతపడిన ఉర్దూ ప్రాథమిక పాఠశాల



మేలుపట్లలో మూతపడి వృథాగా ఉన్న పాఠశాల భవనాలు

పుంగనూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలు రద్దు కావడంతో ఆ భవనాలు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంటూ ఆక్రమణల పాలవుతున్నాయి. ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న పుంగనూరులో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనాలు ఉన్నా విద్యార్థులు హాజరు సంఖ్య తక్కువగా ఉందని గత ఏడేళ్ల క్రితం కొన్ని పాఠశాలలు రద్దు చేశారు. స్థానిక కుమ్మరివీధిలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు గతంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎం.మునస్వామి మొదలియార్, మరికొందరు దాతలు స్థలాన్ని సేకరించగా ప్రభుత్వం పాఠశాల భవనాలు, మరుగుదొడ్ల వసతులతో నిర్మించింది. తర్వాత ఉర్దూ విద్యార్థుల పాఠశాలకు రావడం తగ్గిపోవడంతో స్కూల్‌ను రద్దు చేసి పక్క పాఠశాలకు కలిపింది. అప్పటి నుంచి పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉండగా గత వైసీపీ పాలనలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుమ్మరవీధి పాఠశాల భవనంలో ప్రజలకు ఉచిత శుద్ధ జలాలు పంపిణీ చేయాలని మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. ప్రస్తుతం మినరల్ వాటర్ ప్లాంటుకు తాళం వేయడంతో మూతపడింది. అలాగే పాఠశాలలో ఆటోలు, కార్లు, పశువులు, మేకలు ఉంచుతున్నారు. అప్పుడే పాఠశాల స్థలాలు ఆక్రమణలకు గురైంది. అలాగే స్థానిక మేలుపట్ల ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల పక్కనే గతంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉండటంతో అప్పటి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఒక భవనం, తర్వాత నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరో భవనం ప్రారంభించారు. అయితే పిల్లల హాజరు తక్కువగా ఉందని స్కూల్‌ను రద్దు చేయడంతో పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉంటూ శిథిలావస్థకు చేరుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణదారుల కన్నుపడుతోంది. ఈనేపథ్యంలో వృథాగా ఉన్న భవనాలు ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సి ఉంది.

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛత అవార్డు రావడంతో శనివారం మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డితో పాటు సిబ్బందిని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించి ఘనంగా సన్మానించారు. పలమనేరుకు జాతీయ స్థాయి అవార్డు వచ్చేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్

పలమనేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్ మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు -2 డిపో నుంచి పలమనేరుకు బదిలీపై వచ్చిన అల్తాఫ్ పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డిపోకు మంచి పేరు తీసుకు రావాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వీసులు నడపాలని ఎమ్మెల్యే డిపో మేనేజర్‌కు సూచించారు.

సోమలలో పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



సోమల అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా సోమల, కందూరు బస్టాండ్లలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంగాధరం రాయల్, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సాంబశివ, వీవీ. రమణ, ఎంపీటీసీలు నాగభూషణంరెడ్డి, మహమ్మద్ జిన్నా, హరినాథ్, సర్పంచులు వెంకటరమణ, సౌజన్య, కోదండరాజు, సురేంద్రరెడ్డి, బాషామసూద్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఏఎంసీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి తదితరులు

● **పలమనేరు:** పలమనేరులో శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, వైసీపీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. పలమనేరు మాజీ ఏఎంసీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కల్లూరు:** పులిచెర్ల, కల్లూరులో శనివారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ ఛైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుట్టిన రోజు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. వైసీపీ నాయకులు నాదమునిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డిప్రకాష్, గోవిందరెడ్డి, రాయల్‌మోహన్ పాల్గొన్నారు.

● **నదుం:** పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నదుం బస్టాండులో జరుపుకున్నారు.

బదులు జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలు భూములపై చిత్తూరు జిల్లా 9 వ అడిషినల్ డిస్ట్రిక్ట్ కోర్టు నందు కేసు మాత్రమే O.S. No. 56/2018 పెండింగ్ వున్నది. పై దావాలో షెడ్యూలు ఆస్తి పై ఎలాంటి Injunction Orders force లో లేదు. దీనిపై తప్పుడు పేపర్ పబ్లికేషన్ Date : 11-10-2025 వేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతుంది. ఈ ఆస్తి BMK Ravindra Babu మరియు P.Gopinath విక్రయ బాధ్యపడిన ఆస్తిలో వారి పేరుతో గత 14 సంవత్సరములుగా పాస్ బుక్ మరియు 10(1), Adangal వున్నది. క్రింది షెడ్యూలు ఆస్తిని వారు Date : 03-10-2025 వ తేదీన B. రాజశేఖర్‌కు అమ్మడము జరిగినది. ఈ ఆస్తి గురించి Injunction Order Forceలో వున్నట్లు తప్పుడు ప్రచారము చేయడము చట్ట రీత్యా నేరము. కావున యావన్మందికి తెలియచేస్తున్నాము. వాళ్ళు ఇచ్చిన పేపర్ జనరల్ నోటీసును ఖండిస్తున్నాము.

SCHEDULE

Chittoor Dist., Sri Balaji Reg. District Kuppam, Sub District Kuppam Mandal Kuppam Gramapanchayath No. 128, Kamathamooru Road, Dry, S.N. 102-2, an extent & Ac. 1-76 cents, 0-172 Hectors within the following boundaries. East - Land of Chinna Dorai and Defendants land., West: Cart track leading to Kamathamuru, North: Road leading to Kamathamuru and Chinna Dorai land, South : Defendants own land. Within in these boundaries Wet S.No. 100-2B/1 an extent of A.c. 0-12 cents or 0-049 Hectors with in the boundaris: East Lands of Sundarappa; West - Burial Grounds, North - Lands of Seenappa, South - Road.

M.CHANDRASEKHAR, Y.V.GOKUL, S.GEETHA
Advocates, Chittoor

టీడీపీ కార్యకర్త గోవిందస్వామి మృతి

కుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం కొత్తపేట 14వ వార్డుకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త గోవిందస్వామి వడయార్ అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ ఇన్‌చార్జి అప్పుముఖేశ్, నాయకులు మురళీ, మునస్వామి, మంజునాథ్, సుకుమార్, భూపతి, చంద్ర, శరవణ, జయమ్మ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం శివపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత టైలర్ సుబ్రహ్మణ్యం శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పీఎస్‌మునిరత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ స్థానిక నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణ



బంగారు తిరుత్తణి కొండ గిరి ప్రదక్షిణలో భక్తులు

సోమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ చుట్టు గిరిప్రదక్షిణకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గోవింద నామసర్మణలతో పాల్గొన్నారు. శనివారం ఉదయం స్థానిక శివాలయంలో, వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయం, వరసిద్ధి వినాయకస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు జరిపి అనంతరం గిరిప్రదక్షిణలో స్వామి వారి సంకీర్తనలు ఆలపిస్తూ మార్గంలోని పలు చోట్ల భజన మండలి సభ్యులు కోలాట చెక్క భజనలతో కోలాహలంగా పాల్గొన్నారు. ఈక్రమంలోనే వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పలువురు భక్తులు విరాళం అందజేయడంతో అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమల, చెన్నయ్యగారిపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, నడింపల్లె, అడుసుపల్లె తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు స్థల పరిశీలన



టపాసుల దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

చౌడేపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలో టపాకాయల దుకాణాల నిర్వహణ కోసం అగ్నిమాపక అధికారి సుబ్బరాజు శనివారం స్థల పరిశీలన చేశారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రమాద రహితంగా ఉండే స్థలంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టపాసుల దుకాణదారులు కృష్ణయ్య, శివశంకరరావు, శబరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని లద్దిగంకు చెందిన నూర్‌బాషా తన ఇంటి ముందు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శనివారం ట్రైనీ ఎస్‌ఐ మణికంఠేశ్వరరెడ్డి అరెస్టు చేసి, 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రొంపిచెర్లలో ఆర్ఎస్ఎస్ శత జయంతి వేడుకలు



ఆర్ఎస్ఎస్ విజయోత్సవంలో ప్రతినిధులు

రొంపిచెర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల కట్టకింద శివాలయం వద్ద ఆర్ఎస్ఎస్ శత జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. పుంగనూరు సంఘ ప్రతినిధి కుమార్ రొంపిచెర్ల మండల సంఘ ప్రతినిధి నర్రాహేమంత్, శేషాద్రి నాయుడు ఆధ్వర్యంలో 50 మంది సభ్యులతో విజయోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆర్ఎస్ఎస్ జెండాను ఆవిష్కరించారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ల ఆవిష్కరణ

రొంపిచెర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వినియోగంలోకి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు

పుంగనూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వదేశంలో తయారు చేసి వస్తువులను ప్రతి ఇంట్లో వినియోగించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పుంగనూరు బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం.జగదీష్‌రాజు పిలుపునిచ్చారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా శనివారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో జరిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంట్లో, సమాజంలో భారతీయ ఉత్పత్తులనే ప్రతి ఒక్కరూ వాడాలన్నారు. యువత, పిల్లలకు స్వదేశీ వస్తువుల ప్రాముఖ్యతపై వివరించాల్సిన బాధ్యత తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, పెద్దమఠం బాబు, వెంకటరెడ్డి, చంద్రరాజు, మణిమొదలియార్, నాగరాజ, రమేశ్, ఉమాశంకర్, నరేంద్రరెడ్డి, రెడ్డికుమార్‌రాజు, శ్రీనివాసులు, ఉమామహేశ్ పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నదుం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెరటాసి నాలుగో శనివారం సందర్భంగా స్థానిక కొత్తపల్లెలోని శ్రీవారి క్షేత్రంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి పాదుకలకు భక్తులకు పలు పుష్ప సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

ఓట్ల అవకతవకలపై కాంగ్రెస్ సంతకాల సేకరణ



పుంగనూరులో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీ, అవకతవతకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుంగనూరులో సంతకాలు సేకరిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా రాహుల్‌గాంధీ పిలుపుమేరకు సంతకాల సేకరణ ప్రారంభించినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అరాచకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ముబారక్, ఫయాజ్, అల్తాఫ్, మహ్మద్, సుహేల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం గుట్టపల్లె మార్గంలో ద్విచక్రవాహనాన్ని పాలవ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ గుట్టపల్లెకు చెందిన మల్లయ్య కుమారుడు బి. శంకరప్ప(60) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా పాలవ్యాన్ అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో శంకరప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన శంకరప్పను కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

సీఎంను కలిసిన కడ పీఏసీ సభ్యుడు రఘు



రామకుప్పం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడ రాజకీయ సలహా కమిటీ(పీఏసీ) సభ్యుడు రఘు శనివారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎంకు వివరించినట్లు రఘు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులను రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని సీఎం ఈ సందర్భంగా చెప్పారని రఘు తెలిపారు.

పుంగనూరులో ఎమ్మెల్యే జన్మదినం



పుంగనూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 75వ జన్మదిన వేడుకలను శనివారం పుంగనూరులో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బస్టాండ్‌లో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి ఎన్.అనీషారెడ్డి, ఎన్.శ్రీనాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, నాయకులు కృపాకర్, పద్మావతమ్మ, నాగేంద్ర, లలిత, నాగభూషణం, రాజేశ్, షరీఫ్, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీపీ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండల వైసీపీ శ్రేణులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో అన్నదానం



కొలింపల్లి క్రాస్ వద్ద కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

చౌడేపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను వైసీపీ మండల అధ్యక్షులు నాగభూషణరెడ్డి, జడ్పీటీసీ దామోదర్ రాజు ఆధ్వర్యంలో మండలంలోని కొలింపల్లె క్రాస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక బస్టాండు వద్ద జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, వైసీపీ మండలపార్టీ ఉపాధ్యక్షులు వెంకటరమణ, నాయకులు రుక్మిణమ్మ, మురళీ రాజు, సుబ్రహ్మణ్యంరాజు, నాగరాజ, సంషీర్, షాకీర్, రంగ, విజయ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె పంచాయితీ కృష్ణానగర్‌కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త గంగప్ప శనివారం మృతి చెందారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి నేతలతో కలిసి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు సాయం అందించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

రామకుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతోందని.. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి తెలిపారు. శనివారం రామకుప్పంలో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జీఎస్టీ జిల్లా డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టరు ఇంతియాజ్‌అహ్మద్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జి రవిరెడ్డి, నవీన్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు మురళీ, రెస్కో డైరెక్టరు సతీష్, నేతలు మురళీమోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజారోగ్యం

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యవంత జీవనం సాగించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని కుప్పం ఏఎంసీ ఛైర్మన్ జీఎంరాజు తెలిపారు. శనివారం శాంతిపురంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు నియోజకవర్గంలో ప్రస్తుతం 386 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. రానున్న నెలల్లో ఆ సంఖ్యను రెండింతలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఆయన కోరారు. కుప్పం డీపీఎం అమృతవల్లీ, ఏపీఎం శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్లు హరినాథరెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌కు వరసిద్ధుడి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఏఈవో రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణసారిక, జిల్లా మూడో అదనపు న్యాయమూర్తి గురునాథం, ఆర్డీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో పీవీకేఎన్ కళాశాల మైదానంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీ మాట్లాడుతూ.. ఖరీదైన కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ఈ శిబిరం లక్ష్యమన్నారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాల డాక్టర్లతో వైద్యం అందించడం జరిగిందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు నెలలకోసారి ఇలాంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, మేయర్ అముద, చూడా ఛైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'విజయం' విద్యార్థుల ఎంపిక



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 29మంది విద్యార్థులు ప్రముఖ గ్లోలాజిక్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి శనివారం తెలిపారు. వర్చువల్, గ్రూప్ డిస్కషన్, ఫేస్ టూ ఫేస్, హెచ్ఆర్ రౌండ్స్ ప్రక్రియలో బీకామ్, బీబీఏ విద్యార్థులు రూ.4.2 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరిని అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

హోంమంత్రి అనితకు సాదర స్వాగతం



చిత్తూరు అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటకు విచ్చేసిన హోంమంత్రి అనితను ఎస్పీ తుషార్ డూడి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోంమంత్రికి మొక్కను బహూకరించారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైద్యాధికారులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యాధికారులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యులు పాల్గొన్నారు.



హెచ్చరిక

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా, నా కక్షిదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా, పెనుమూరు గ్రామం, పెనుమూరు మండలం నందు నివాసముండు తాలూరు సాయి క్రిష్ణ గారి ధర్మపత్ని అయిన కె.సి.హనీ చౌదరి అను ఆమె 10-03-2011 తేదీన షెడ్యూలు దాఖలా ఆస్తిని తన తండ్రి ద్వారా దస్తావేజు సంఖ్య 617/2011 దాన సెటిల్మెంటు దస్తావేజు ద్వారా లబ్ధిపడి నాటి నుండి నేటి వరకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కలిగి రెవిన్యూ వారి ద్వారా ఈ పాసుపుస్తకము పొంది స్వాధీన అనుభవములో కలరు. కాగా సదరు రాష్ట్రం తిరుపతి జిల్లా, తిరుపతి పట్టణము, బైరాగిపట్టెడ, ఇంటి సంఖ్య 46 నందు నివాసముండు కీ॥శే॥ యస్. రంగయ్య గారి భార్య యస్. సుబ్బమ్మ అను ఆమె తప్పుడు దస్త్రముల ద్వారా తనకు ఎలాంటి హక్కు, స్వాధీనము, అనుభవము లేకుండా షెడ్యూలు దాఖలా ఆస్తిని వాస్తవములు కప్పిపుచ్చి ఇతరులతో నామమాత్రపు విక్రయ ఒప్పందములు తనఖాలు, విక్రయములు ఇతరత్రా లావాదేవీలకు లోబర్చేందుకు తీవ్ర ప్రయత్నములు చేయుచున్నారు అని విశ్వసనీయముగా తెలియవచ్చినది. కావున యావన్మందికి తెలియచేయడం ఏమనగా సదరు యస్. సుబ్బమ్మ ద్వారా ఎలాంటి లావాదేవీలు షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి జరపరాదని, అట్లు ఈ హెచ్చరికను మీరి ఎవరైనా ప్రవర్తించిన ఎడల అట్టి లావాదేవీలు చట్టపరంగా చెల్లుబాటు కావని అట్టి వారిపై నా కక్షిదారు తగు చట్టపరమైన చర్యలు గైకొనగలరు అని హెచ్చరిక చేయడమైనది.

షెడ్యూలు (ఆస్తి వివరము)

శ్రీ బాలాజి రి.డి., తిరుపతి పాకాల సబ్-డి-పెనుమూరు మండలం, కామచిన్నయ్యపల్లి లెక్కదాఖలాలో:- ఉత్తరం: దేశయ్య పగైరాల నేలలు, దక్షిణం: పెనుమూరు - కామచిన్నయ్యపల్లి రోడ్డు, తూర్పు: చిన్నబ్బనాయుడు, వేమానాయుడు నేలలు, పడమర: దోర్నాల క్రిష్ణయ్య నేల, ఈ మధ్యన గల సర్వే నెం. 148/1బి1, ఎ.1-55 సెంట్లు లో ఎ.0-65 సెంట్లు హెక్టార్లు 0.261 నేల, సర్వే నెం. 148/1బి2 ఎ.0-64 సెంట్లు, హెక్టార్లు 0.257 గల నేల వెరశి ఎ.1-29 సెంట్లు గల నేల, సర్వే నెం.148/1ఎ ఎ.1-82లో, ఉత్తరం: జి.రఘునాథ నాయుడు నేలలు, దక్షిణం: వెంకటేశు నాయుడు నేలలు, తూర్పు: వెంకటేశు నాయుడు నేల, పడమర: పార్వతి నేలలు, ఈ మధ్య విస్తీర్ణం 0.60 1/2 సెంట్లు హె.0.244 గల నేలలు. సర్వే నెం. 166/4 ఎ.2.24 సెంట్లులో ఉత్తరం: జి.మునస్వామి నాయుడు నేల, దక్షిణం: అనందమ్మ నేలలు, తూర్పు: బి.సి.మునిరత్నం నాయుడు నేలలు, పడమర: జి. అనందమ్మ నేలలు. ఈ మధ్య ఎ.1-60 సెంట్లు, హె.0.653 గల నేల పూరా. పై నేలలో యుండు నానాజాతి ఆకుచెట్లు పూరా.

శ్రీ వి.చిట్టిబాబు, న్యాయవాది
10/170, గాంధీ రోడ్డు, చిత్తూరు.







తొడతర వద్ద కొట్టుకుపోయిన వంతెన - అరగొండ, జొన్నగురకల రోడ్డు వద్ద కొట్టుకుపోయిన వంతెన - పాక్షికంగా ధ్వంసమై కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉన్న గాజులపల్లె వంతెన

తవణంపల్లె మండలంలో భారీ వర్షం

కొట్టుకుపోయిన రెండు వంతెనలు - ప్రమాదకరంగా మరో రెండు

తవణంపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొర్లుతున్నాయి. పడమటి సరిహద్దు అటవీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు మండలానికి వచ్చి చేరి.. బాహుదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. బాహుదానదిపై తొడతర వద్ద నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. దీనివల్ల సరకల్లు వైపు వెళ్లే సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అరగొండ-జొన్నగురకల మధ్య ఇదే నదిపై ఉన్న వంతెన కూడా కొట్టుకుపోయింది. అరగొండ-గాజులపల్లె రోడ్డులో నదిపై ఉన్న వంతెన, మత్యం వద్ద ఉన్న మరో వంతెన కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. దాంతో ఆయా మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సుధాకర్ కొట్టుకుపోయిన వంతెనలతోపాటు గాజులపల్లె, మత్యం వద్ద దెబ్బతిన్న వంతెనలను కూడా ఆయన పరిశీలించారు. ప్రజలు వాగులు దాటకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే నదికి సమీపంలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డబ్బులిచ్చాకే పనులు చేసుకోండి

హైరోడ్డు బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న మనోహర్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయే వారికి ధరను బట్టి డబ్బులివ్వాలని బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ నేతలు చెప్పారు. శనివారం సింధు హోటల్‌లో హైరోడ్డు ఓనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశులు నాయుడు, మనోహర్ మాట్లాడుతూ.. న్యాయబద్ధంగా తమకు రావాల్సిన డబ్బులను ఇచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలన్నారు. టీడీఆర్ బాండ్ల వల్ల ఒరిగిందేమీ లేదని.. డబ్బుల రూపంలో ఇస్తేనే ఒప్పుకుంటామన్నారు. వంద అడుగుల రోడ్డుకు బదులు 80 అడుగుల వరకు తీసుకునే విధంగా అధికారులు పునరాలోచించాలని కోరారు. జనసేన నేత దయారాం మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు కోర్టు తీర్పు మేరకు మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు అధికంగా చెల్లిస్తేనే విస్తరణకు ఒప్పుకుంటామన్నారు. చాలామందికి రోడ్డుకు అవసరమైన సరిపోయే స్థలం మాత్రమే ఉందని, విస్తరణకుపోతే మిగిలేది ఏమీ లేదన్నారు. అటువంటి వారంతా ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. అనంతరం సభ్యులంతా త్వరలో సీఎం, డిప్యూటీ సీఎం కలవాలని సమావేశంలో తీర్మానించారు. ఈకార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ హరి, లీగల్ అడ్వయిజర్ అబ్దుల్ రహీమ్, 200 మందికి పైగా బిల్డింగ్ ఓనర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



మొక్క నాటి నీరు పోస్తున్న అజయ్‌కుమార్

గుడిపాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించుకుందామని నేషనల్ హైవే ప్రాజెక్టు అధికారి అజయ్‌కుమార్ అన్నారు. శనివారం లక్ష్మీపురం వద్ద నరహరిపేట హైస్కూల్, సీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు, హైవే అధికారులు కలిసి మొక్కలు నాటారు. చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సంసూల, ముఖేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు పయనం



పాలసముద్రం మండలానికి చెందిన భక్తులతో భీమనేని చిట్టిబాబు

పాలసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్య నిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు పెరటాసి నెల నాల్గవ శనివారం కావడంతో పాలసముద్రం మండలవాసులతో కలిసి కాలినడకన తిరుమలకు బయల్దేరారు. తొమ్మిదేళ్లుగా భీమనేని ఆధ్వర్యంలో పాలసముద్రం భజన మందిరం వద్ద గోవిందమాలలు వేసి.. నాల్గవ శనివారం తిరుమలకు కాలినడకన వెళుతున్నారు. ఈ ఏడాది కూడా పాలసముద్రం నుంచి 300 మంది భక్తులతో ఆయన బయల్దేరి వెళ్లారు.

'టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక'



సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

గుడిపాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, సీనియర్ నేత బాలాజినాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు అన్నారు. ఈ నెల 15న సింగిల్ విండో, టీడీపీ మండల పాలక వర్గాలతోపాటు సూపర్ సిక్స్ విజయోత్సవం, జీఎస్టీపై వసంతాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజవంతం చేయడానికి సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జన సమీకరణ చేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యయాదవ్ మాట్లాడుతూ.. సభను విజయవంతం చేయడానికి కమిటీ వేశామని చెప్పారు. అనిల్‌కుమార్, మురళినాయుడు, దొరబాబు, జయచంద్ర, ఐజాక్, ఉదయ, లలిత, చల్లా, రవినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో చెస్ స్కూల్ ప్రారంభం

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేపమాను వీధిలో చెస్ స్కూల్‌ను చిత్తూరు చెస్ అసోసియేషన్ ఛైర్మన్ బాబుప్రసాద్‌రెడ్డి, వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి కలిసి శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని హంగులతో తొలిసారిగా చిత్తూరులో చెస్ స్కూల్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్, సైనిక్ వెల్ఫేర్ అధికారి రాఘవులు, టీడీపీ నాయకుడు కాజూరు బాలాజీ, మండి సుధా, చెస్ స్కూల్ నిర్వాహకులు ఎస్ఆర్ దినేష్, ఎస్ఆర్ లేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

15న మామిడి రైతుల ఆక్రందన సభ



కరపత్రాలు విడుదల చేస్తున్న జనార్దన్ తదితరులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు గిట్టుబాటు చెల్లించే వరకు ఉద్యమం ఆగదని మామిడి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ స్పష్టం చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో 15న బంగారుపాళ్యంలో నిర్వహించే రైతుల ఆక్రందన సభ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించే వరకు పోరుబాట ఆగదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మామిడి కిలోకి రూ.12 చెల్లించాలని, సబ్సిడీ కింద ప్రభుత్వం ఇచ్చే రూ.4లను కూడా వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. మిగిలిన రూ.8 మొత్తాన్ని ఫ్యాక్టరీలు, ర్యాంపు యజమాన్యాల నుంచి ఇప్పించాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్రన్, రైతులు శ్రీనివాస్, హేమలత, మురళి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు





పూజల్లో పాల్గొన్న భక్తులు - శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలు

చిత్తూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు పంచాయతీ పరిసర ప్రాంతంలోని గోవిందరాజులు గుట్టపై శ్రీవారి పాదాల వద్ద పెరటాసి మాసం నాల్గవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఇక్కడ నిర్మించనున్న ఆలయం కోసం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను పోతురాజులపల్లెకు చెందిన రుకేష్‌నాయుడు సమకూర్చారు. వీటికి పూజలు చేసి, ఆలయ కమిటీ నిర్వాహకులకు అప్పగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తాళంబేడు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో టీడీపీ బీసీ నేతలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయండి

- హోంమంత్రి అనితకు శ్రీధర్‌యాదవ్ విజ్ఞప్తి



గంగాధరనెల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని టీడీపీ బీసీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని హోంమంత్రి అనితకు టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహ సందర్శనకు శనివారం ఆమె రాగా మర్యాదపూర్వకంగా కలిసి, విన్నవించారు. పరిశీలించి న్యాయం చేస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారన్నారు.

ఆలయాల పవిత్రతను కాపాడుకుందాం

చిత్తూరు సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల పవిత్రతను కాపాడుకుందామని సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు మధుసూదనం పిలుపునిచ్చారు. 'స్వచ్ఛత నుంచి దివ్యత్వం' వరకు కార్యక్రమంలో భాగంగా.. శనివారం కట్టమంచిలోని కుళందీశ్వరాలయ ఆవరణను శుభ్రం చేశారు. సభ్యులు గజేంద్రరెడ్డి, సావిత్రి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసె

అధికార, విపక్ష నేతల మధ్య వివాదానికి కారణమైంది



వనదుర్గాపురంలో ప్రభుత్వ భూమిలో ఉన్న గుడిసె

పాలసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురంలో రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో కృష్ణయ్య అనే వ్యక్తి గుడిసె వేసుకుని ఉంటున్నాడు. శ్రీరంగరాజపురం మండలం నుంచి ఇతను రెండేళ్ల కిందట ఇక్కడికొచ్చి స్థిరపడ్డాడు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పింఛన్‌ను కూడా పాలసముద్రం మండలానికి బదిలీ చేసుకున్నాడు. ఇతడి బంధువుల సూచన మేరకు ప్రభుత్వ స్థలాన్ని కాజేయడానికి గుడిసె వేసుకున్నాడని అధికార పార్టీ నేతలు తహసీల్దార్ అరుణకుమారికి ఫిర్యాదు చేశారు. ఆమె శుక్రవారం తన సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన గుడిసెను తొలగించాలని హుకుం జారీ చేశారు. అయితే ఆ స్థలాన్ని కృష్ణయ్యకే ఇవ్వాలంటూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణయ్య గుడిసె సమస్య కాస్తా అధికార, విపక్ష నాయకుల మధ్య వివాదంగా మారింది.

సంక్షిప్తంగా..

నేడు నేత్రవైద్య ఉచిత శిబిరం

పూతలపట్టు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నేత్రవైద్య ఉచిత శిబిరం జరగనుంది. ఈ మేరకు కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు శిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదు ద్విచక్రవాహనాల చోరీ

బంగారుపాళ్యం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లెలో ఐదు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. తగ్గువారిపల్లెకు చెందిన ఈశ్వర్, సమీవుల్లా, సుధాకర్, మరో ఇద్దరి ద్విచక్ర వాహనాలు తమ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉండగా శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

హోంమంత్రికి ఘన స్వాగతం



వెదురుకుప్పం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవళంపేటకు వచ్చిన హోం మంత్రి వంగలపూడి అనితకు వెదురుకుప్పం టీడీపీ నేత సాతల గుణశేఖర్ పుష్పగుచ్ఛమిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఉన్నారు.

నగరి ఏఎంసీ డైరెక్టర్‌కి సన్మానం



నగరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరి ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన జి.లక్ష్మిని పలువురు సన్మానించారు. వీరిలో.. నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి, నగరి టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కుమార్‌నాయుడు తదితరులున్నారు.

ధ్వంసమవుతున్న తారురోడ్లు



విజయపురం - కోసలనగరం మార్గంలోని తారురోడ్డుపై నిలిచిన వర్షపునీరు

విజయపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విజయపురం - కనకమ్మసత్రం, చిన్న జంబాడ - కేశవపురం మార్గమధ్యంలోని రహదారులపై వర్షపునీరు నిలవడంతో తారు రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారం పేరుకోవడం, కాలువలు ఆక్రమణకు గురికావడమే దీనికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చౌడేపల్లె మండలంలోని లద్దిగంకు చెందిన నూర్‌బాషా తన ఇంటి ముందు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శనివారం ట్రైనీ ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి అరెస్టు చేసి, 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.